ఐఐటీహెచ్ హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ

మారథాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ బీఎస్ మూర్తి

సంగారెడ్డి మార్చి16 (నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో నవంబర్ 30న నిర్వహించే హాఫ్ మారథాన్ 2025 పోస్టర్‌ను ఆదివారం ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఐటీహెచ్‌లో ఏటా హాఫ్ మారథాన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ వివరాలు, ఈవెంట్ అప్‌డేట్స్ ఐఐటీహెచ్ రన్నర్ క్లబ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయ ని తెలిపారు. ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు ప్రేమ్‌పాల్, మహేంద్ర కుమార్, మనీష్ నిరంజన్, డాక్టరర్ హిమాంశు జోషి, వెంకటరావు, బద్రి నాథ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ శంబీపూర్ రాజును సన్మానిస్తున్న మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి

జిన్నారం, మార్చి 16 : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, జిన్నారం మాజీ జడ్పీటీసీ, కొలను బాల్‌రెడ్డి ఆహ్వానం మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆదివారం బొల్లారంలో కలిశారు. ఇటీవల బాల్ రెడ్డి నూతన గృహప్రవేశం జరిగిన నేపథ్యాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు వేణు పాల్ రెడ్డి, సాయికిరణ్ రెడ్డి, ప్రభు నాయక్, నాయకులు వెంకటేశం గౌడ్, రాజేశ్, జైపాల్‌రెడ్డి, నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నిజాంపూర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

సదాశివపేట, మార్చి 16 : మండల పరిధిలోని నిజాంపూర్ ఉన్నత పాఠశాల 1997-98 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులు మాణయ్య, మహి, సోమలింగం, పూజోద్దీన్‌లను సన్మానించారు. పూర్వ విద్యార్థులు రాజశేఖర్‌రెడ్డి, నందకుమార్, రఘు, బ్రహ్మం, విజయ్, శమంత, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో..

జహీరాబాద్ పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2011-12 విద్య సంవత్సరంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. అప్పటి గురువులను సన్మానించారు.

-జహీరాబాద్, మార్చి 16

రెడ్డి సంక్షేమ సంఘం భవనం ప్రారంభం

గుమ్మడిదలలో రెడ్డి సంక్షేమ సంఘం భవాన్ని ప్రారంభించిన సంఘం నాయకులు

గుమ్మడిదల, మార్చి16 : గుమ్మడిదల కేంద్రంలో నిర్మించిన రెడ్డి సంక్షేమ సంఘం భవనం, మినీ ఫంక్షన్‌హాల్‌ను రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జగ్గారెడ్డి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి సంఘం నాయకులు ఘనం గా ప్రారంభించారు. రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణరెడ్డి, బొల్లారం మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, రెడ్డి నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మూడుచింతల నరేందర్‌రెడ్డి, డా. శ్రీనివాస్‌రెడ్డి, వీరభద్రస్వామి ఆలయకమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మద్దీవీరారెడ్డి, సందీప్‌రెడ్డి, రవిరెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, పోచుగారి మోహన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా బొల్లారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. రెడ్డిల అభ్యున్నతికి, యువత విద్యకు రెడ్డి సంక్షేమ సంఘం నుంచి కృషి చేయాలని సూచించారు.

జోరుగా ఆస్తి పన్ను వసూళ్లు

ఇంటింటికీ వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

జిన్నారం, మార్చి 16 : జిన్నారం మండ లం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్ల స్పెషల్ డ్రైవ్ జోరుగా కొనసాగుతోంది. సెలవు రోజున సైతం అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించి ఆస్తి పన్ను వసూళ్లు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి మా ట్లాడుతూ నేటి వరకు 73 శాతం ఆస్తి పన్ను వసువులైందన్నారు. కేవలం హ్యాండ్ మిషన్ల ద్వారా రూ.8.10 లక్షలు వసూలు చేయగా, రూ.4.29 లక్షలు చెక్కుల రూపంలో వసూలు చేసినట్లు తెలిపారు. మొత్తం డిమాండ్ రూ.16.25 కోట్లు ఉండగా, నేటి వరకు రూ. 11.90 కోట్లు వసూలు చేసామన్నారు. మరో రూ.4.34 కోట్లు వసూలు చేయాలని తెలిపారు. మరో 14 రోజులే గడువు మిగిలి ఉన్న నేపథ్యంలో బకాయి దారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించాలన్నారు. గృహ యజమానులు, పారిశ్రామికవేత్తలు గడువులోగా పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరా రు. మాజీ కౌన్సిలర్ వేణు గోపాల్‌రెడ్డి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆదివారం ఆస్తి పన్ను చెల్లించారు. మున్సిపల్ వ్యాప్తంగా 14 బృందాలతో ఆర్వో నర్సింహులు జోరుగా ఆస్తి పన్ను వసూళ్ల ప్రక్రియను చేపడుతున్నారు. మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్ స్వామి, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు రఘు రాంరెడ్డి, ప్రదీప్, మహ్మద్ అలీ, కంప్యూటర్ ఆపరేటర్లు మహేందర్, సునీత పాల్గొన్నారు.

కల్హేరు : ఎండిన వరి పంట , ఎండి పోయిన బోరుబావి →

ఎండుతున్న పంటలు.. అన్నదాతల ఆందోళన

- పొట్టదశకు వచ్చేసరికి నీరందని పరిస్థితి
- అడుగంటుతున్న భూగర్భ జలాలు

హత్నూర/కల్హేర్/నాగలిగిద్ద, మార్చి 16 : ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతన్నకు కష్టాలు తప్పడంలేదు. ఎన్నో ఆశలతో అప్పులు చేసి యాసంగి వరి సాగుచేసిన రైతులు పంట కండ్ల ముందు ఎండిపోతుండటంతో దిక్కుతోచని స్థితిలో ఎండిన పంటను చూస్తూ కండ్లనీళ్లు పెట్టుకుంటున్నారు. ఓవైపు మండుతున్న ఎండలు మరోవైపు భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో బోరుబావుల్లో నీరుతగ్గి చేతికివచ్చిన పంట ఎండిపోతుండటంతో పశువులకు మేతగా వేయాల్సిన దుస్థితి నెలకొన్నది. తొమ్మిదేండ్లుగా యాసంగి పంటసాగుచేస్తే ఏఒక్క ఎకరా కూడాఎండిపోని పంట, నేడు ఎకరాలకొద్ది ఎండిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. పొట్టదశకు వచ్చిన వరిని కాపాడుకోవడం కోసం లక్షల రూపాయలు ఖర్చుచేసి అదనంగా బోర్లు తవ్విస్తే అందులో నీరురాకపోవడంతో మరింత అప్పుల పాలవుతున్నారు. భూగర్భ జలాలు ఎండిపోవడానికి తోడుగా కరెంటు కోతలు విధిస్తుండటంతో పంటలు ఎండి పశువులకు మేతగా మారుతున్నాయని రైతులు పాపోతున్నారు.

హత్నూర శివారులో ఎండుతున్న వరిపంట

నాలుగు బోర్లున్నా ఒక్కదాంట్లోనే..

నాకున్న ఆరు ఎకరాల్లో వరి సాగు చేశా. మొదట్లో పంటకు నీరు పుష్కలంగా లభించినా రోజులు గడిచేకొద్ది బోరుబావుల్లో నీరు తగ్గుముఖం పట్టింది. దీంతో మూడు బోర్లలో నీరు పూర్తిగా తగ్గిపోవడంతో అదనంగా రెండు బోరువావులు తవ్వించగా.. ఒకదాంట్లో చుక్కనీరు రాలేదు. మరోదాంట్లో కొద్దిపాటి నీళ్లురావడంతో సగం పంటకు మాత్రమే నీరందుతుంది. రెండు లక్షలు ఖర్చుచేసి బోర్లు తవ్విస్తే కొద్దిపాటి నీరురావడంతో ఏమిచేయాలో తోచని పరిస్థితి నెలకొంది. కండ్లముందు వరిచేను ఎండిపోతుంటే పశువులకు మేతగా వేయడం తప్ప మరోదారి కనిపించడంలేదు. ఏనాడు ఇలాంటి పరిస్థితి ఎదురవ్వలేదు. ప్రభుత్వం స్పందించి పంటలు ఎండిపోయిన రైతులను గుర్తించి ఆర్థికంగా ఆదుకోవాలి.

-పండుగరాజు, రైతు, హత్నూర

ముందు నీళ్లు పోసింది.. రోజు రోజుకూ తగ్గి పోయింది

యాసంగిలో మొదట్లో బోరు మంచిగా పోసింది. అంతే పోస్తుందనే నమ్మకంతో రెండు ఎకరాల్లో వరి పంటను వేశా. పొలం పెరిగిన కొద్ది బోరులో నీళ్లు తగ్గుతూ వచ్చినయ్. రెండు ఎకరాల్లో వరి పంటను వేసినందుకు రూ.30 వేలకు పైగా ఖర్చు అయ్యింది. పంట పండుతుందనే భరోసాతో అప్పు చేశా. పెరిగిన పచ్చని పంటను చూస్తుంటే దుఃఖం వస్తుంది. చేసిన అప్పు ఎలా తీర్చాలో భయం పుట్టుకుంది.

-విస్లావత్ వినోద్ రైతు, కొత్త చెరువు తండా, కల్హేర్

పశువులకు మేతగా వేస్తున్నాం..

యాసంగిలో మాకున్న పొలంతోపాటు ఇతరుల పొలం కౌలుకు తీసుకొని పదహారు ఎకరాలు వరిసాగు చేశాం. బోరుబావుల్లో నీరుందన్న నమ్మకంతో యాసంగిలో వరిపంట సాగుచేస్తే పంట పొట్టదశకు వచ్చేసరికి బోరుబావుల్లో నీరు తగ్గుముఖంపట్టి నీరందడంలేదు. పదహారు ఎకరాల్లో కేవలం పది ఎకరాల పంట చేతికొచ్చేలా కనిపిస్తున్నది. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరిగిపోవడంతోపాటు బోరుబావుల్లో నీరుతగ్గుతుండటంతో కొద్దిమేరకైనా పంటను కాపాడుకోవడానికి కొంతపంటను ఎండబెట్టుకోవాల్సి వస్తున్నది. బోరుబావుల్లో నీరు తగ్గడానికితోడు అప్పుడప్పుడు కరెంటు కోతలు మొదలవ్వడంతో పంటలు ఎండిపోతున్నాయి. లక్షల రూపాయలు ఖర్చుచేసి పంట సాగుచేస్తే కనీసం పెట్టుబడి డబ్బులు వచ్చినా చాలు అనిపిస్తుంది. గతంలో ఏనాడు ఇలాంటి పరిస్థితులు ఎదురుకాలేదు.

-వల్లిగారి ముత్యాలు, రైతు, హత్నూర

రైతులను పట్టించుకొని ప్రభుత్వం

మాది కర్ణాటక సరిహద్దు గల ఔదత్‌పూర్ గ్రామం. పక్క నుంచి మంజీరా నది ప్రవహిస్తున్నది. నాకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. పదేండ్లలో వ్యవసాయ పనులు చూసుకుంటూ హమాలీ పనికి వెళ్లేటోడిని. ఇప్పుడు రోజు వ్యవసాయం దగ్గర ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం 24 గంటలు కరెంటు ఇస్తామని, మూడు గంటలు కూడా సరిగా ఇవ్వడం లేదు. అది ఎప్పుడు వస్తాదో తెలుస్తాలేదు. కరెంటు సరిగా లేక మోటర్ కాలిపోతున్నది. ఇప్పుడు రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది.

-అర్జున్ రైతు, ఔదత్‌పూర్ గ్రామం, నాగల్‌గిద్ద

డంపింగ్‌యార్డును రద్దు చేయాలి

గ్రామాల్లో సంతకాల సేకరణ.. 40వ రోజుకు చేరుకున్న రిలే నిరాహారదీక్షలు



డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్ష చేపట్టిన యాదవ సంఘం సభ్యులు

గుమ్మడిదల, మార్చి16 : డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను రద్దు చేయాలని గ్రామాల్లో రైతు సంఘాలు పట్టుబిగిస్తున్నాయి. దీని కోసం గ్రామాల్లో ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కలిగిస్తూ రైతు సంఘాల నాయకులు చైతన్యం తీసుకువస్తున్నారు. అంతేకాక ప్రజా సంఘాల పోరాట సమితి గుమ్మడిదల మండల గ్రామాల్లో సంతకాల సేకరణను చేపట్టారు. ఆదివారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో యాదవ సంఘం సభ్యులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. వీరికి రైతు జేఏసీ నాయకులు సంఘీభావం తెలిపారు. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో రైతు జేఏసీ నాయకులు 40వ రోజు డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలను చేపట్టారు. నల్లవల్లి రైతు జేఏసీ నాయకులు ప్యారానగర్‌లో ప్రొజెక్టర్ ద్వారా డంపింగ్‌యార్డు వల్ల కలిగే నష్టాలపై దృశ్యరూపంలో గ్రామస్తులకు అవగాహన కలిగించడంతో ప్యారానగర్ గ్రామస్తులు ఆగ్రామంలో రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ప్రజా సంఘాల పోరాట సమితి వేదిక కన్వీనర్ రాజయ్య, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు అధ్వర్యంలో కానుకుంట, అనంతారం, గుమ్మడిదల, బొంతపల్లి, దోమడు గు, అన్నారం, మంభాపూర్ గ్రామాల్లో ప్రజలతో సంతకాల సేకరణ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటన చేయకపోతే హైదరాబాద్‌లోని దీక్ష శిబిరం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వీరితో పాటు అత్తిమేలి మాణిక్యం, నర్సింహులు, నాగేశ్వర్‌రావు, రాజయ్య, యాదగిరి, విద్యాసాగర్, అశోక్, ప్రవీణ్, ప్రభు తదితరులు పాల్గొన్నారు. గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో రైతు జేఏసీ నాయకులు గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్ పుట్ట నర్సింగ్‌రావు, సద్ది విజయ భాస్కర్‌రెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, కరుణాకర్, కుమ్మరి ఆంజనేయులు, రామకృష్ణ, కొరివి సురేశ్, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చైతన్య ప్రభు జయంతి

హమాలీ కాలనీలో జయంతిని జరుపుకొంటున్న భక్తులు

జహీరాబాద్, మార్చి 16 : ద్వాపర యుగంలోని శ్రీకృష్ణుడే కలియుగంలో చైతన్య మహా ప్రభువుగా అవతరించారని సంగారెడ్డి మండలంలోని కంది ఇస్కాన్ టెంపుల్, అక్షయ పాత్ర బాధ్యులు విభీషణ్ ప్రభు వెల్లడించారు. శ్రీకృష్ణ పరమాత్మ పట్ల ఏ రకమైన భక్తిని కలిగి ఉండాలో చైతన్య మహా ప్రభు తన వ్యక్తిగత జీవితం ద్వారా తెలియజేశారని ఆయన సోదాహరణంగా వివరించారు. ఆదివారం చైతన్య మహా ప్రభు జయంతిని పురస్కరించుకొని జహీరాబాద్ పట్టణంలోని హమాలీ కాలనీలోని పెద్దమ్మ ఆలయంలో నగర్ సంకీర్తన ఆనంతరం ఏర్పాటు చేసిన సత్సంగ సభలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం భక్తులు తెచ్చిన ప్రసాదాలను నివేదించి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మర్వాడీ కుల సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు

విద్యానగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యా సంస్థల చైర్మన్ ఈధర ఆంథోనీరెడ్డి జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

-సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 16

దత్తగిరిలో మృత్యుంజయ లక్ష జప యజ్ఞం

బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్ రెడ్డిని సత్కరిస్తున్న పీఠాధిపతులు

ఝరాసంగం, మార్చి 16 : జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా బాసిల్లుతున్న బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఆదివారం దత్తగిరి మహారాజ్ 46వ వార్షిక అమరతిథి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, మహామండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్‌ల ఆధ్వర్యంలో వేద మంత్రాలతో మహా మృత్యుంజయ యంత్ర శతసహస్ర లక్ష జపయజ్ఞం, పూర్ణాహుతిని నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేశవరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం గుప్తా, విశ్వమానవ ధర్మ ప్రచార సంఘం నాయకులు శేరి నర్సింగరావు, రాజు పాటిల్, జిల్లా శివశక్తి అధ్యక్షుడు శ్యామ్‌రావు పాటిల్ పూర్థిస్తాయి ఏర్పాట్లు చేశారు.

ఇఫ్తార్ విందు..

ఇఫ్తార్ విందులో తుకారం కురుమ

రాయికోడ్, మార్చి 16 : బీఆర్ఎస్ నాయకుడు, వరం వైస్ చైర్మన్ తుకారం కురుమ ఆధ్వరంలో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విఠల్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మల్లేశం కురుమ, మజీద్ సదర్ మఖ్సూద్, నాయకులు పాషుద్దీన్, రాజు, విజేందర్‌రెడ్డి, సందీప్‌స్వామి, రావి ఉన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

హత్నూర మండలం గుండ్లమాచునూర్‌లో ఆదివారం బోనాల పండుగను ఉత్సాహంగా జరుపుకొన్నారు. గ్రామంలోని పోచమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం డప్పుచప్పుల్లు, శివసత్తుల విన్యాసాలమధ్య బోనాల ఊరేగింపును నిర్వహించారు.

-హత్నూర, మార్చి16

పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుండు లక్ష్మణ్

గుండు లక్ష్మణ్

కల్హేర్, మార్చి 16 : కల్హేర్ మండల పరిధిలోని మార్డి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గుండు లక్ష్మణ్‌ను పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని నారాయణగూడ పీఆర్టీయూటీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 33 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుండు లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంగారెడ్డి జిల్లాలోని మారుమూల ప్రాంతమైన నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్ మండలం బీబీపేట్ గ్రామానికి చెందిన గుండు లక్ష్మణ్ పీఆర్టీయూ కల్హేర్ మండల శాఖ సంఘ కార్యకర్తగా విధులు నిర్వహించారు.

నేడు సిద్ధి వినాయక ఆలయాల్లో సంకష్టహర చతుర్థి వేడుకలు

జహీరాబాద్, మార్చి 16 : న్యాల్‌కల్ మండల పరిధిలోని రేజింతల్, హద్నూర్, చీకూర్తి గ్రామాల్లోని సిద్ధి, వర సిద్ధి వినాయక ఆలయాల్లో సోమవారం సంకష్టహర చతుర్థి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ఆలయాల ట్రస్టు సభ్యులు, నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలకు మన రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల భక్తులు హాజరుకానున్నారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.

అలరించిన కుస్తీ పోటీలు

తలపడుతున్న మల్ల యోధులు

నాగల్‌గిద్ద, మార్చి16 : మండల పరిధిలోని ఇరక్‌పల్లి రణకం ఉత్సవాల్లో సందర్భంగా ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీలు ప్రజలను విశేషంగా అలరించాయి. ఈ పోటీకి మాజీ సర్పంచ్ విఠల్‌రావు ప్రారంభించారు. హోరా హోరీగా సాగిన పోరులో మహారాష్ట్ర, కర్ణాటక చెందిన కుస్తీ క్రీడాకారులు మొదటి రెండు బహుమతు లు గెలుచుకున్నారు. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రామచంద్రాపురం, మార్చి 16 : ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ కాల్వ గడ్డ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి వెలిమల గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో జరిగిన ఓ కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు ఆర్కే ఫౌండేషన్ సభ్యులు పరీక్ష సామగ్రి, స్టేషనరీని అందజేశారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

అందోల్, మార్చి 16 : బోర్‌మోటర్‌ను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించి, విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతిచెందిన సంఘటన జోగిపేటలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై పాండుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేటకు చెందిన చిత్తారి సంగమేశ్ జోగిపేట శివారులోని పొలంలో బోరుమోటర్‌ను దొంగిలించేందుకు వెళ్లాడు. అదే సమయంలో విద్యుత్ షాక్ తగలడంతో ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. మృతుడి కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చలో ఢిల్లీకి ఎల్ఐసీ ఏజెంట్లు

నారాయణఖేడ్, మార్చి 16 : న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా ఎల్ఐసీ ఏజంట్ల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం నారాయణఖేడ్ నుంచి ఎల్ఐసీ ఏజెంట్లు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈనెల 19న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించతలపెట్టిన ధర్నాలో ఎల్ఐసీ ఏజెంట్లు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. ఎల్ఐసీ పాలసీపై విధిస్తున్న జీఎస్టీని రద్దు చేయాలని, బోనస్ పెంచాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ ఏజెంట్లు మాధవరావు, తోట వెంకటేశం, సంగారెడ్డి, కాశీనాథ్, దుర్గయ్య, రామచంద్ర, తుకారాం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

పాడైన 108తో ఇక్కట్లు

నారాయణఖేడ్, మార్చి 16 : నారాయణఖేడ్‌లో సేవలందిస్తున్న 108 వాహనం పూర్తిగా పాడై పోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల ఓ రోగిని అత్యవసరంగా సంగారెడ్డికి తరలించాల్సి ఉండగా వాహనాన్ని వేగంగా నడపలేని పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆలస్యంగా సంగారెడ్డి దవాఖానకు చేరుకున్నామని రోగి బంధువులు తెలిపారు. ఈ క్రమంలో 108 అంబులెన్స్ గురించి ఆరాతీయగా వాహనం ఇప్పటికే 3.70 లక్షల కిలోమీటర్లు నడిచినట్లు తేలింది. వాహనం డోర్లు తుప్పు పట్టి విరిగిన కారణంగా దుమ్ము వాహనంలోకి ప్రవేశించడం, వాహనంలో ఫ్యాన్లు పనిచేయకపోవడం వంటి లోపాలు బయటపడ్డాయి. 3.50 లక్షల కిలోమీటర్లు నడిచిన వాహనాన్ని మార్చాలనే నిబంధనల ఉన్నప్పటికీ సదరు అంబులెన్స్‌ను మార్చకపోగా, వాహన నిర్వహణ సైతం సక్రమంగా చేపట్టడం లేదని తెలుస్తున్నది. అత్యవసర సేవలకు వినియోగించే 108 అంబులెన్స్ ద్వారా మెరుగైన సేవలందించే దిశగా ఉన్నతాధికారులు స్పందించి నూతన వాహనాన్ని అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయ హుండీ చోరీ

జిన్నారం, మార్చి 16 : జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీలోని కొత్త హనుమాన్ ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయంలోకి ప్రవేశించిన దొంగలు హుండీని ధ్వంసం చేసి డబ్బులు దొంగతనం చేశారు. ఆదివారం ఈ ఘటనపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.